# ‘పట్టా’ తెచ్చిన సంతోషం

■ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పట్టాలందుకొని మురిసిన లబ్ధిదారులు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 1: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల పట్టాలను ఆదివారం మంత్రి కేటీఆర్ అందజేశారు. సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ప్రగతి నివేదన సభకు హాజరైన ఆయన, ఏడో విడుత పట్టాలు పంణీ చేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషంలో మునిగి తేలారు.

## 35 ఏండ్ల కలనెరవేరింది.



రామకృష్ణాపూర్, అక్టోబర్ 1: నాపేరు గొడిశెల ప్రమీల. నా భర్త పేరు భీమయ్య. 35 ఏండ్లుగా క్యాతనపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ ఆర్కే 4గడ్డలో రేకుల షెడ్డు నిర్మించుకొని నివాసం ఉంటున్నాం. ఇక్కడి ఇల్లు కట్టుకున్నప్పుడు సింగరేణి సెక్యూరిటీ గార్డులతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ఈ ఇండ్ల స్థలాలకు మంత్రి కేటీఆర్ పట్టాలివ్వడం చాలా ఆనందంగా ఉంది. గతంలో మురుగు నీటి కాలువలు ఉండేవి కాదు. తాగునీటికి అరిగోస పడ్డాం. తెలంగాణ వచ్చినంకనే ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి, నీళ్లిస్తుండు. పారిశుధ్య లోపం లేకుండా చేసిండు. మా ఇంకి పట్టాలిప్పించి సీఎం కేసీఆర్‌కు, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు రుణపడి ఉంట.

## ప్రభుత్వానికి రుణపడి ఉంటం..



మా ఇంటి పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. మా తాత, మామ సింగరేణిలో పని చేశారు. ఇప్పుడు నా భర్త తమ్ముడు శ్రీనివాస్ సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు. మేము ఎన్నో ఏండ్ల నుంచి ఇక్కడే సింగరేణి స్థలంలో సిమెంట్ రేకుల షెడ్డు వేసుకొని ఉం టున్నాం. డాబా ఇల్లు కట్టుకుందామంటే సింగరేణి అధికారులతో ఇబ్బందులు ఎదుర య్యేవి. అందుకే పక్కా ఇల్లు కట్టుకోలే. సీఎం కేసీఆర్ మా ఇండ్లకు పట్టాలిస్తమని చెప్పిం డు. దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పుడు మాఇంటి స్థలానికి పెద్దసారు కొడుకు, మంత్రి కే టీఆర్ వచ్చి పట్టా ఇచ్చిన్రు. ఇప్పుడు పెద్ద ఇల్లు కట్టుకుంట. వచ్చేసారి కూడా సీఎంగా కేసీఆర్ సారే గెలవాలే. సీఎం కేసీఆర్‌కు, ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటం.

**-ఆత్మకూరి మంజుల, శ్రీనివాసనగర్, రామకృష్ణాపూర్**

## ఇగ ధైర్యంగా పక్కా ఇల్లు కట్టుకుంట..



రామకృష్ణాపూర్‌లోని 17వ వార్డులో 50 ఏండ్ల సంది ఉంటున్నం. నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే పెండ్లయ్యింది. పిల్లలు కూడా ఉన్నరు. కానీ ఇల్లు మాత్రం సొంతంగా లేదు. అదే పెద్ద బెంగ ఉండే. సింగరేణి స్థలం కావడంతో ఇల్లు మరమ్మతులు చేసుకుందామన్నా ఇబ్బందయ్యేది. ఇల్లు కూడా పాతగైంది. ఇక కూలిపోయే స్థితికి వచ్చింది. సీఎం కేసీఆర్ మా కష్టం తెలుసుకొని పట్టా ఇప్పించిండు. మాఎమ్మెల్యే సుమన్ మాకు ఇంత మంచి పని చేసి పెట్టిండు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకొని, ఇగ ధైర్యంగా పక్కా ఇల్లు కట్టుకుంట. జీవితాంతం సీఎం కేసీఆర్ సారుకు, ఈ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంట.

**-కర్రావుల పద్మ , శ్రీనివాస్‌నగర్**

## మళ్లీ కేసీఆరే సీఎం కావాలే..



మాది క్యాతనపల్లి మున్సిపాలిటీలోని అంబేద్కర్‌నగర్. 10 ఏండ్లుగా నివాసం ఉంటున్నాం. సింగరేణి స్థలంలో ఉన్న ఇంటికి ఇంటి పట్టా వస్తదని అనుకోలేదు. సీఎం కేసీఆర్, మా ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నరు. మా అదృష్టంగా భావిస్తున్నాం. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పట్టా అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమైంది. మరోమారు ఇలా పనిచేసే ప్రభుత్వమే అధికారంలోకి రావాలి. ఆయన వస్తేనే మాలాంటి పేదోళ్లకు మంచి జరుగుతది. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే మళ్లోసారి ఓటేస్తాం.

**-కండె భారతి, 4వ వార్డు**

## నాకు, నాభర్తకు ప్రజా సేవకు అవకాశం వచ్చింది



రామకృష్ణాపూర్, అక్టోబర్ 1: కేసీఆర్ పాలనలో నాకు, నా భర్తకు ప్రజా సేవకు అవకాశం వచ్చింది. క్యాతనపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడుగా నా భర్త కొక్కుల సతీశ్‌కు అవకాశం వచ్చింది. 2018 లో మున్సిపాలిటీగా ఏర్పడినప్పుడు మా ఎమ్మెల్యే బాల్క సుమన్ నాకు 3వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇచ్చి, గెలిపించిన్రు. కేసీఆర్ పాలనలో ప్రజా ప్రతినిధులుగా మాకు అవకాశం వచ్చింది. ఇప్పుడు సింగరేణి స్థలంలో కట్టుకున్న మా ఇంటికి పట్టా ఇచ్చిన్రు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్న. మన రాష్ట్రం, మన ఊరు అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ పార్టీకే ఓటెయ్యాలె.

**-కొక్కుల స్రవంతీసతీశ్, కౌన్సిలర్**

# మందమర్రిలో ఘన స్వాగతం

■ హెలీప్యాడ్ వద్దకు పుష్పగుచ్ఛాలు అందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
■ బతుఘాట్ వద్ద రాఖీలు కట్టి మద్దతు తెలిపిన మహిళలు
■ పలు అభివృద్ధి పనులకు పారంభోత్సవాలు, శంకుస్థాపనలు
■ సభకు భారీగా తరలి వచ్చిన ప్రజలు, శ్రేణులు
■ ప్రతిపక్షాలపై విమర్శలు, చలోక్తులతో నవ్వులు పూయించిన మంత్రి



మందమర్రి పట్టణంలో మిషన్ భగీరథ ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

మందమర్రి, అక్టోబర్ 1 : రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు మందమర్రి పట్టణంలో ఘన స్వాగతం లభించింది. మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం మంత్రి కేటీఆర్ ఆదివారం ఉదయం 10.52 గంటలకు మందమర్రి పట్టణానికి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ దండె విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్, పురాణం సతీశ్, కలెక్టర్ బదావత్ సంతోశ్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో రూ. 500 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ పరిశ్రమకు భూమి పూజ చేశారు. అనంతరం ప్రాణహిత కాలనీలో రూ.కోటితో నిర్మించిన కేసీఆర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనం, రూ. 2 కోట్లతో నిర్మించిన సమ్మక్క–సారలమ్మ మహిళా భవనాన్ని మంత్రి ప్రారంభించారు. పాలచెట్టు ఏరియాలో రూ. 29.68 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రూ. 5 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. బతుకమ్మ ప్రాంగణం వద్ద పలువురు మహిళలు మంత్రి కేటీఆర్‌కు రాఖీలు కట్టారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో విజయ సాధిస్తుందని ఆశీర్వదించారు. అనంతరం కోల్‌బెల్ట్ రహదారిపై రూ. 3.30 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైటింగ్ సిస్టం, రూ. 40 కోట్లతో నిర్మించిన మిషన్ భగీరథ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్, టీబీజీకేఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. సభలో మంత్రి ప్రతిపక్షాలపై చేసిన విమర్శలు, చలోక్తులకు నవ్వులు విరిశాయి. మందమర్రిలో మంత్రి కేటీఆర్ పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. వేదికపై కళాకారుల ఆటాపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు బతుకమ్మలతో తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్‌లో అభివృద్ధి పనులకు..

రామకృష్ణాపూర్, అక్టోబర్ 1 : చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి–రామకృష్ణ పట్టణాల మధ్య.. ఖాజీనగర్ వద్ద రూ. 8 కోట్లతో పాలవాగుపై నిర్మించబోయే వంతెనకు మంత్రి కేటీఆర్ విప్ బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి భూమి పూజ చేశారు. రామకృష్ణాపూర్ పట్టణంలో రూ.15.16 కోట్లతో నిర్మించిన 286 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని గాంధారి వనంలోగల 250 ఎకరాల్లో తొలి విడుతగా రూ. 18 కోట్లతో కేసీఆర్ అర్బన్ పార్కు పనులకు భూమి పూజ చేశారు. క్యాతన్‌పల్లిలో మున్సిపాలిటీలో ఆర్వోబీ పనులను మంత్రి పరిశీలించారు. రామకృష్ణ పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.15 కోట్లతో డ్రైన్స్, రోడ్లు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 25 కోట్లతో కేసీఆర్ అర్బన్ ఏకో టూరిజం, షాదీఖానా, రోడ్లు కాల్వలు, పట్టణ ప్రగతిలో భాగంగా రూ.85 లక్షలతో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్, చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లకు శిలాఫలకాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు.



మంత్రి రామన్నకు జ్ఞాపికను బహూకరిస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు



వ్యవసాయశాఖ, హార్టికల్చర్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రామన్న



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న విప్ బాల్క సుమన్



మందమర్రిలో వెళ్తున్న మంత్రి కేటీఆర్ కాన్వాయ్

# మందమర్రి మున్సిపాలిటీని డీనోటిఫై చేయాలి

■ చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా, పారుపల్లి, ఆస్నాద్‌లను మండలాలు ఏర్పాటు చేయాలి
■ ఆర్‌వోబీ పనులు వేగంగా పూర్తి చేయించాలి ■ మంత్రి కేటీఆర్‌ను కోరిన విప్ సుమన్

కోటపల్లి, అక్టోబర్ 1 : 1/70 చట్టం నుంచి మందమర్రి మున్సిపాలిటీని డీ నోటిఫై చేసి ఇక్కడి ప్రజల కష్టాలను తీర్చాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. ఆదివారం రామకృష్ణాపూర్‌లోని ప్రగతి స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో విప్ బాల్క సుమన్.. మంత్రి కేటీఆర్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి యజ్ఞం కొనసాగుతుందని, ఇందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీర్వాదాలు అవసరమన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న పేదలకు జీవో 76 ద్వారా పట్టాల పంపిణీ జరుగగా, గంగానగర్, విద్యానగర్, జవహర్‌నగర్, శివాజీనగర్, భగత్‌సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, శ్రీనివాసనగర్, మల్లిఖార్జుననగర్, రాంనగర్, ఏజోన్ పోస్టాఫీసు లైన్‌లో మిస్ అయిన ప్రతి ఒక్కరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. చెన్నూర్ రెవెన్యూ విజన్ ఇక్కడి ప్రజల చిరకాలస్వప్నమని, ప్రాణహిత పరీవాహక ప్రజల కోరిక మేరకు కోటపల్లి మండలం పారుపల్లిని, చెన్నూర్ మండలంలోని గోదావరి నది పరీవాహక గ్రామాల కోరిక అయిన అస్నాద్‌ను మండలాలుగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. క్యాతనపల్లి ఆర్‌వోబీ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని, ఆ బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ, రామకృష్ణాపూర్‌లు ఒకప్పుడు మైన్స్‌తో వెలుగొందిన ప్రాంతాలని, పూర్వ వైభవం తెచ్చేందుకే రూ.160 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ మంత్రిగా మరిన్ని నిధులు మంజూరు చేసి క్యాతనపల్లిని మరింత అభివృద్ధి చేయించాలని కేటీఆర్‌ను కోరారు. చెన్నూర్ నియోజకవర్గం అంటే గులాబీ కోట అని, కేసీఆర్ అడ్డా అని, ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని చెప్పుకొచ్చారు.